# మబ్బు వేట

వైశాఖ పౌర్ణమి. దట్టమైన కానుగచెట్ల ఆకుల్లోంచి వెన్నెల పల్చగా, చుక్కల తెల్లచీరలా రాజయ్య పక్కమీద పరుచుకుంటున్నది. రాత్రి పన్నెండవుతుంది. వుండి వుండీ ఒక్కమాటుగా వాతావరణం స్తంభీభూత మైంది. ఆకులన్నీ మంత్రం వేసినట్లు కదలకుండా నించున్నాయి. విపరీతమైన వుక్కపోతకి రాజయ్య పక్కలోని మూడేళ్ళ వెంకటేశు ఇటూ అటూ దొర్లటం మొదలెట్టాడు. వాడి మోకాలు రాజయ్య డొక్కలో గుచ్చుకొని రాజయ్యకి మెలకువ వచ్చేసింది. లేచి మంచంమీద కూర్చున్నాడు. వెంకటేశు నిద్దట్లో మొలచుట్టూ, మొలతాడులో కట్టబడిన సత్తుపావలా కాసులిని చేత్తో పీక్కుంటూ, బరుక్కుంటున్నాడు. రాజయ్య పిల్లాడి చేతుల్ని పుచ్చుకుని బరుక్కోవటం ఆపి "దీని సోకు తిరగబడ ! పిల్లాడు ఒకటే గిచ్చేసుకోవటం! వళ్ళంతా గాట్లు పడిపోతున్నది" అని భార్య మాణిక్యం మీద విసుక్కున్నాడు. ఎదురుగా వూరి కావల రస్తామీద ఏవరో నడిచిరావటం గమనించాడు.

"వోరది ! అర్ధరాత్రేళ్లి సికాల్లు కొడ్తన్నారు ?" అని పలకరించాడు. ఆ నడుస్తున్న ఆకారం ఎదుటకి వచ్చి నిలబడ్డది. రాజయ్య మంచంకోడుకి కట్టిన కుక్క తాడు లాక్కుంటూ, "భౌ భౌ" మని మొరగసాగింది. పురికీ, పురికీ మధ్య నున్న స్థలంలో వున్న కోళ్ళ గంపల క్రింది కోళ్ళు ఇటూ అటూ తిరుగుతూ "కొక్కొ కొక్కొ" అంటూ రొద చేయటం మొదలెట్టాయి. ఎదురుగా వున్న పాక కవతలగా నున్న సీమచింత చెట్టుమీది కొంగలు ఒక్కసారి రెక్కలు టప టపమంటూ విదిలించి మళ్ళీ ముక్కుల్ని పొట్టలోపెట్టుకుని కూకున్నాయి.

"నేనే రా ! కాటి ముసిరిగాణ్ని" అన్నాడు వచ్చిన ఆకారం. ఒక ఇటికబొంత లాక్కుని కూలబడ్డాడు ముసిరిగాడు.

"ఎక్కడికిరా బయల్దేరావు రాత్రికాడ !" అన్నాడు రాజయ్య.

"నే నొక్కణ్నే ఎట్టబోతన్నాను. నిన్ను సలహా జేయిందే ! బాప్ప ఇంటో నేదేటి ?" అన్నాడు. తీరిగ్గా బొడ్లో నున్న చుట్ట తీసి వెలిగించాడు ముసిరి.

"దాని సిగ తెగ్గోసిరి. ఇంటో నిలబడ్డదా ! వారాని కోపాలన్నా గూడేనికి పోయి బయసోకు చూడకుండా వుండ లేదట. మొన్న దాళవా కోతలకి రెడ్డిసీమ పోయి, నాలుగు డబ్బులు చేసుకున్నది. అవి దులుపుకురాటానికి

గూడేనికి పోయింది.అయినా ఇంత ఎన్నెలరాత్రిల్లో మబ్బేట ఎట్టారా ? ఎవురన్నా సూత్తే మక్క లిరగదంతారు నాలుగు రోజులు పోనీయి సీకటి రాత్రిళ్ళొస్తాయి" అన్నాడు రాజయ్య.

"అవ్వ వచ్చేదాకా అమాస ఆగుతుందట్రా ! నువ్వంటే, నాలుగు సిక్కలు ఎనకాల తిరుగుతున్నాయి కాబట్టి నిలబడ్డావు. మా కెట్టా జరుగుద్ది ? పిట్టను కొట్టాల ! పొయ్యిలో పిల్లి లెగాల" అన్నాడు ముసిరిగాడు.

"అయితే, రేపు మాపటేల దాటెద్దాం మరి మీ కామందు ఆకుమళ్లు దున్నుకుంటున్నాడేమో ఎట్టా. నువ్వ కాలవకా డుండద్దా ? అయినా ఏమన్నా గింజలు కావా లున్నంటే న న్నడగకూడదంట్రా ! మనలో మనకి ముకం చాటెందుకు ?" లాలించాడు రాజయ్య.

"నే నీ సాలు, కమతం, మారుద్దా రనుకుంటున్నాను మావా ! పెద్ద బాపయ్య ఇరవయి బత్తాల కుండమని కబు రంఫుతున్నాడు. ఈ కామందు కేమో నలబయి రూపాలు ఋణం వున్నాను. అది తీర్చకుండా నన్ను వదలడు. తీరుద్దా రంటే కాణీ లేదు. బాపయ్య రెక్కల మీద అప్పలీయ డంట ! ఆణ్ని వొదిలిచ్చుకుంటే నాలుగు బత్తాలు ఎక్కువ వొత్తయి. ఈ మద్దెని నాగాలకి ఇరకోసుకుంటున్నాడు. ఋణం మీద వడ్డీ కడ్తన్నాడు. అందుకని ఈ కమూకత్రి చేయాల్సి వొస్తున్నది. నా పాణం ఎంత గిజగిజలాడ్తన్నదో నీ కేటి తెలుస్తది ?" అన్నాడు ముసిరిగాడు.

"ఎందు కంత డీలాపడిపోతావు? అందరూ ఆపాటి కక్కూర్తి చేసేవోళ్లే! ఈ బాపయ్య ఈనాడింత కమతం నిలుపుకున్నాడంటే అదంతా పెళ్లే అనుకున్నావేటి! నీతి నాయం అనుకుంటూ ముక్కు మూసుకున్నాడికి గంజినీళ్ళే పుట్టవు! పదిమంది ఉన్నోళ్ళపెట్టెలని కొట్టి మనం బాగుపడాల! ఇంతకీ ఎక్కడన్నా, అడ చూసేవా!" రహస్యంగా అడిగాడు రాజయ్య.

"మొన్న గుళ్ళపాడు శివార్లకి తాళ్ళకోసంపోయాను. అక్కడున్నవాళ్ళ దొడ్లల్లో ఉన్నాయి పురులూ మావా! ధర పెరుగుతాదని, ఒక్క గింజన్నా అమ్మకుండా వందేసి, రెండువందలు బత్తాలు పురులు కట్టేసినారు. అన్ని వంక సన్నాలే. డెబ్భయిరోజులు తిరిగేసరికి కోత కొస్తవని గామాల్ను, బాగా బలంవున్న పొలాలు, ఆపయిన పంది పెంట, పాటిమట్టి తోలుకున్నారేమో పదేను ఇరవయి బత్తాలు కూడా రాలాయంట ఎకరానికీను. అంతా వున్న మారాజులే కనుక పొలానికి బలంచేసుకున్నారు."

"అట్టారా! వంకసన్నం గింజలు పరమాణ్ణంచేసుకుంటే బలేమజాగాఉంటయి! మీ బాప్పకి ఇష్టంకూడానూ. తాళ్ళేమన్నా బాగున్నాయా! నేనూ ఒకటి రండుతాళ్ళుకొనాల్రా, పశువులపాక నలిగిపోయింది. ఈ సారి రెండు నిట్రాళ్లు ఏసి, కాలు గుంజల్ని వుంచి ఏద్దారనుంది."

"ఓరబ్బోసి! తాళ్ళు మాలావు కరీదు చెప్తున్నా

రాళ్ళు. పులెట్టి పొడిచి పేడుదీస్తే అరంగుళమన్నా చేవ తేల లేదు. పదేసి, పదేనేసి చెప్తున్నారు. నాచుగుంట ఎర్రిమల్లి కేసి పోయి చూడాలి. రెడ్డిసీమని, కొయ్యాల గూడేన్నివున్నా యంటున్నారు. నేను చూడలేదు." అన్నాడు ముసిరిగాడు

"సర్లే! రేపు చూద్దాం. అయితే అన్నీ వంకసన్నాల పురు లేనంట్రా! అక్కడ కుక్కలేమన్నా వున్నాయా!" కుక్కలుంటే తన కుక్కనికూడా తీసుకపోదామని రాజయ్యకి.

"కుక్కల్లేవు! మనుష్యులే కాపలా లుంటున్నారు. అందులో సత్తెయ్యగారి మల్లయ్య నాకు సాయంచేత్తన్నాడు. పొట్టిపాడులో ఆడి మావగారింటిలో మూట లాగ్గెయ్యొచ్చునంట. ఆడిది ఒకవంతు. మనకి మూడు వంతులు. మనిద్దరం చెరిసగం పంచుకుందాం. మళ్ళీ ఇంకోళ్లని పిలుస్తే భాగం పెట్టాల. నాలుగురోజులు తిరిగితే కాని నాలుగుమూటలు లాగలేముగందా! నువ్వు బాగా చేయితిరిగినోడివి గందా అని నీతో చెప్పాను" బాధగా అన్నాడు ముసిరిగాడు.

"నేనూ సొంత సేద్యం మొదలెట్టాక మానుకున్నాను. పోన్లే వొంటిగాడివి ఎట్టాపోతావ్ అని సాయితా చేద్దారనుంది. ఇందులో మీ బాప్ప నాకంటే బాగా చేయి తిరిగినాది నీకు తెలుసో తెల్దో కాని." పురిమీద ఆరబెట్టిన తాటి నారని తెచ్చుకుని నాగలిమోకు వేయటం మొదలెట్టాడు రాజయ్య.

"ఏం ! నిద్ర తేలిపోయిందేమిటి ?" అన్నాడు ముసిరిగాడు.

'తేలిపోనాదిరా ! సుక్క పొడిచాక పోయి నాగలి కట్టుకోవాలి. మోకు నలిగిపోనాది. మీ బాప్ప సుక్క పొడిచే సరికి వచ్చేస్తదిలే ! ఎంకటేసు వొక్కడూ పడుకున్నాడని వుండిపోయాను. లేకపోతే కాలవమీదకు పోదును. రామయ్య తూములు బిగకొట్టేశాడంట ! సచ్చేదవ ! ఎదరకిపోతే 'బాబ్బా బ్బాబు' అంటూ కాళ్ళమీద పడతాడు." గర్వంగా అన్నాడు రాజయ్య.

"అయితే మా బాప్పకికూడా మచ్చేటలో అనుభవ ముందన్నమాటే ?" జిజ్ఞాసగా అడిగాడు ముసిరి.

"అసలు మీ బాప్ప నాకెలా దొరికిందంటా ?" ఎదురుప్రశ్న వేశాడు రాజయ్య. రాజయ్య కళ్ళు ఆనందంతో నక్షత్రాల్లల్లే మెరవసాగాయి మాణిక్యం అంటే పంచ ప్రాణాలూ విడుస్తాడు రాజయ్య. దాని చూపులూ, మాటలూ, పాటలూ, వాడి గుండెల్లో మెరిసే వజ్రపు తునకలు ! దాని చలవవల్లే తన జన్మదాస్యం, జరాబుణంలా వుండే పాలి తనంలోంచి, రెండెకరాల మాగాణికి రైతయినాడు రాజయ్య. రాజయ్య, మాణిక్యాల జీవఫలం వెంకటేసు.

'మనల్నందర్నీ మించిన మచ్చేటకాడు ఏడుకొండలాడు. అంచేత ఆ సామిపేరు పెట్టాల మన సంటోడుకి' అన్నది మాణిక్యం. అంచేత 'వెంకటేసు' అని ముద్దుగా పిల్చుకుంటూరు కొడుకుని మాణిక్యం తన కెలా దొరికిందో

ఆ దివ్య సుందరస్మృతిని రాజుకి వందసార్లయినా మననం చేసుకొంటే రాజయ్య రాగహృదయం తృప్తి చెందదు. పది సంవత్సరాల క్రితం.

ఆ ఏడు కొల్లేరు క్రిందనున్న పొలాలకి చాళవా ఇచ్చేరు. అప్పుడు బాపయ్యకి ఇరవయి ఎకరాలే చేనుండేది. పదిసంవత్సరాలు గడిచేసరికి ఇరవయి ఎకరాలని వంద ఎకరాలకి పెంచగల్గాడు. బాపయ్య పెరటిలో పెద్దగడ్డివా ముండేది. నలభయ్ ఏభయ్ బళ్ళ గడ్డి వుండేది. ఆ గడ్డి అడుగునున్న రేగడిబెడ్డల దిమ్మతీస్తే పెద్ద పాతరుండేది. ఆ యేడే రాజయ్య బోదెలు పొడవటం, గొడ్లను కాయటం గడ్డివాము వేయటం నించి, బాగా బరువెత్తుకోవటం, నాగలి దున్నటం మొదలగు పనులు అవలీలగా చేయడం నేర్చుకున్నాడు. బాపయ్య వూళ్ళో ఎవరుగడ్డి అమ్మినా కొనేసి తన "వామి"లో పడేసేవాడు.

"ఈ గడ్డిమీద ఇంత మోజేమిటి! పశువులబదులు, ఈడే మేస్తాడా ఏమిటి గడ్డి!" అనుకునేవాడు రాజయ్య. ఒకరోజు రాత్రివేళ, అమావాస్యముందర ద్వాదశినాడు-

"ఒరే! నువ్వు బస్తామోస్తూ స్పీడెల్లగలవంట్రా!" అన్నాడు బాపయ్య.

"అదెంత పని! మైలుదూరమన్న లగెత్తకలను" అన్నాడు యువరక్తం వుడుకులెత్తుతూంటే రాజయ్య

"అయితే నువ్వు బొమ్మిడికీతల కాలవకట్టమీద నుంచో!" అన్నాడు బాపయ్య. చిక్కటి చీకటిలో నక్షు

త్రాలని లెక్కపెడ్తూ రాత్రి ఒంటిగంటదాకా కాలవకట్ట మీద తాటిచెట్లక్రింద నించున్నాడు రాజయ్య. వెనకాతల మళ్ళల్లోంచి గంగయ్య వగుర్చుకుంటూ వచ్చి ఒక అరబస్తా మూటరాజయ్య నెత్తిమీద పెట్టి కాగుపాడుకేసి వెళ్ళి పోయాడు. రాజయ్య పరుగెత్తుకుంటూ వచ్చి బాపయ్య దొడ్లో పడ్డాడు.

"శబాసురా! రాజీ!" అన్నాడు బాపయ్య. అప్పటి కప్పుడే గంగయ్య, అసిరయ్య, నాచుగుంట గొల్లయ్య మూటలతో రెడీగా వున్నారు అందరూ రాత్రికి రాత్రే పాతరలో ధాన్యం కప్పెట్టేసి పైన మామూలుగా రేవటి బెడ్డలతో దిమ్మేసి గడ్డి కప్పేసారు. బాపయ్య అందరికీ తలొక అయిదూ, పదీ ఇచ్చేసి పంపేశాడు. బాపయ్య పండిం చేది అక్కుళ్ళు, పాలేళ్ళ జీతాలు కొలిచేది నల్లార్లూ, అమ్ముకునేవి రాజనాలూ, వంకసన్నాలు, కోయంబత్తూరు సన్నాలు, ఘన్నక్రిష్ణకాటుకలూ, ఢిల్లీభోగాలు మొదలైన హైక్లాసుధాన్యం. అవైనా ఒకసారి అమ్మేవాడు కాదు. పట్నం వెళ్ళినప్పుడల్లా రెండూ, మూడూ బస్తాలు పట్టించుకు వెళ్ళి అమ్ముకునేవాడు. వూర్లో ఎవరికి ఏ అవసరాలకి సొమ్ము కావాల్సివొచ్చినా బాపయ్యనే అడగాల్సి వొచ్చేది. ధాన్యం వర్తకమే కాక. వూళ్ళో శనగపప్పుండలు, మరమరాలుండలు, వేరుశనక్కాయలు మొదలైన చిరుతిళ్ళ సామానులు బీదా బిక్కీకి అమ్ముకునేవాడు. బాపయ్యచేతిలోపడ్డ నగ మళ్ళీ విడిపించుకుందుకు ఎవడికీ అక్కరుండేదికాదు. వాడ్డీలకి

వోడ్డీలు పెరిగిపోయి తాకట్లు వాకట్లు అయిపోవాల్సిందే! బాపయ్యనాయకంలో రాజయ్య మచ్చేటలో బాగా గడి తేరాడు. ఎవడన్నా అడ్డమొస్తే కాళ్ళు మెలేసి అవతలవాణ్ని పడగొట్టి దాట్లమీద తప్పించుకునేవాడు. బాపయ్య కమతం పెరగటానికి కారణం మూడుపంతులు రాజయ్య భుజబలమే. అయినా వేటగాళ్ళకి విశ్వాసముంటుందా! మాణిక్యం రాజయ్య తెచ్చే నల్లార్లబియ్యం తినలేకపోయేది. అదెప్పుడూ రాజనాలు, వంకసన్నాలే తిని పెరిగింది. బాపయ్యకి డబ్బు వేటతోపాటు సౌందర్యపు వేటకూడా అలవాటు అయ్యింది. అదే మాణిక్యం మనసులో ముల్లులా గుచ్చుకుంది కాబోల్ను! రాజయ్యతో బెంగగా.

"రాజీ! నువ్వా కమతంలోంచి ఇవతలి కొచ్చేయి. బాపయ్య నావంక అదోలా చూస్తున్నాడు. మడిసి మునపట్లా లేడు!" అన్నది మాణిక్యం దాని కేమాత్రం బాధ కలిగినా సహించడు రాజయ్య. రెండేళ్లు కూలిపనులు చేసుకున్నారు ఇద్దరూను. ఆపయిన రెండెకరాలు కొనుక్కొని ఒక కాడి పోతులతో వ్యవసాయం చేసుకోవటం మొదలెట్టాడు రాజయ్య ఈచేను కొనుక్కోవటంలో రాజయ్య సామర్థ్యంకన్న మాణిక్యం సామర్థ్యమే ఎక్కువ అని చెప్పొచ్చును. మాణిక్యాన్ని కలుసుకున్న స్మృతి రాజయ్య మనసులో ప్రతి వెన్నెలరాత్రీ వేడి పుట్టిస్తుంది. అదే ఆ రోజు! మరపురాని మంచిరోజు!

బాపయ్య మొక్కుబడి తీర్చుకోటానికి తిరుపతి

వెళ్ళాడు. రాజయ్య వూరికే వుండట మెందుకని దాళవా కోతలకి వెళ్లాడు పత్తేపురానికి. ఎండాకాలం పగలంతా బాగా ఎండంతా పడటంనించి సాయంకాలానికి ప్రాణం తిక్కగా వుండటం మొదలెట్టింది రాజయ్యకి. కాసిని కల్లు నీళ్ళు తాగి బయట కూర్చున్నాడు. వేడీ వెన్నెలా రాజయ్య శరీరం వుడికించి వేస్తున్నవి. ఆ వేళ కోసివేసిన పనల్లోంచి సందెడు పన తీసుకుని వెళుతున్నది మాణిక్యం. చేతులో బంగారుదారాల్లా వంకసన్నాల గడ్డిపోగులు

"వారది!" అన్నాడు మత్తులోవున్న రాజయ్య

"నేనే!" పికిలిపిట్టలా అంది మాణిక్యం.

"నేనంటే ఎవరూ?"

"ఈవూరిదాన్నే!" శంఖంలా ధ్వనించిం దీసారి ఆమె గొంతు.

"అయితే మటుకు? అదేం పాడుపనీ? అడుక్కొని తీసుకుంటే పోదా!" బుద్ధిమంతుడులా అన్నాడు రాజయ్య.

"నాలుగు పనలు లాక్కుంటె రోజెల్లిపోద్ది! కండబలం వుండగా అడుక్కోవట మేం ఖర్మ!" ధీమాగా అన్నది మాణిక్యం.

"బలే! ధైర్నమంతురాలు. కేక వేయగానే గజగజ లాడుతూ బిక్కమొఖం వేయలేదు." అనుకొని ముచ్చట పడ్డాడు రాజయ్య. కళ్లు తెరచి నిదానంగా ఆమెలోకి చూశాడు.

"ఇదేనన్నమాట నీపని! మరిమీవోడేం చేస్తున్నాడు! ఆడూ ఇదేపనా?" జిజ్ఞాసగా అడిగాడు రాజయ్య.

"మావోడు! మావో డెవరూ? సుక్కల్లో సెందురుడా! ధాన్నెంలో మట్టిబెడ్డా!" పకపకా సీతాఫలం విచ్చినట్లు నవ్వింది.

"ఇంకా మను వాడలేదన్నమాట ! దొంగపిల్లని ఎవుడు కట్టుకుంటాడు ?" వెక్కిరించాడు రాజయ్య వుల్లాసంగా.

"దొంగోడి పెళ్ళాం దొరసానంట! నా లాంటి దొంగ ముండావోడే మనువాడుతాడు, నీ కెందుకు ?" బింకంగా అంది మాణిక్యం. దాని చూపూ, మాటా, వయ్యారం రాజయ్య తలలో గింగరాలు తిరిగాయి.

"నీపేరే మాణిక్కెం! నువ్వు నా ఇంటికీ, కంటికీ కూడా మాణిక్కె దీపానివేనే!" అంటూంటాడు రాజయ్య. రాజయ్య దగ్గరి కొచ్చాక, అది కష్టపడటం నేర్చుకున్నది. పూడ్పుల్లోనూ, కోతల్లోనూ కూలికి పోయేది. వేరుశనగ కోతలకి వెళ్ళిందంటే ఇంటికి వచ్చేసరికి నాలుగు కుంచాల కాయలన్నా తెచ్చిందన్నమాటే! రాజనాలబియ్యం, కొత్త బెల్లంతో పరమాన్నంచేసి వేరుశనగ పప్పులు ఆవునేతితో వేయించి రాజయ్యకి వడ్డించేది.

"ఏ క్షణాన్న చూచుకున్నామో! నేనంటే అంతప్రాణం దానికి! ఏదీ నా దగ్గర దాచదు. దాని కళ్ళేంటాయ్ !

ఎప్పుడూ చెర్లో చేపలల్లే జిలజిల్లాడుతూనే వుంటాయ్!" అనుకునేవాడు.

*          *          *

కాలవకావతల తాటాకుబొడిపి ప్రక్కన వట్టి గడ్డిమీద తుంగచాప పరచిన శయ్యమీద బాపయ్య చేతుల్లో ఆనంద పారవశ్యం అనుభవించుతోంది మాణిక్యం. రాజయ్య కంటిదీపం! ఇంటిజ్యోతి!

"మీవోడు పాలితనం మానేక నీ కసలు తీరుబాటే లేదులా వుంది. కనపట్టమే మానేశావ్!" అన్నాడు బాపయ్య.

"సంటోడితో తీరటం లేదు. అదేనా బయస్కోపు వంకని ఇట్టా రాగలుగుతున్నాను. ఇంక పోతాను బాబూ. జాము పొద్దు తిరిగిందిలా వున్నది." అన్నది మాణిక్యం.

"పోదువుగాని లెద్దూ! ఇంకా చంద్రుడు ఆకాశం నడింగా రాందే? అప్పుడే బయస్కోపు వదల్రు లే!" అన్నాడు బాపయ్య.

"సెందురుడు ఆకాశంమీద నడింగా వచ్చేడో లేడో ఎట్టా తెలుస్తదీ! ఆ వోరసన మబ్బులు కమ్మేస్తేనూ? నాను పోతాను ఆడు చూస్తే మక్కెలిరగదంతాడు!" అన్నది గునుపుగా.

"ఆడు ఇట్టా రాడులేవే! మాంచి గడితేరిన మబ్బేటగాడు! ఎవుడి పుర్లో తెగ్గోయటానికి పోతాడు!" సముదాయించాడు బాపయ్య.

"అడ్ని మించిన మబ్బేటగాడు మీరు కారేటి! అడి గాలానికి చిక్కిన చేపని మీరు లాక్కోనేదా!" మురిపెంగా అన్నది మాణిక్యం.

"ఏం చేపవి? బొమ్మిడాయిచేపవి! చేతుల్లోకి వచ్చి నట్లే వచ్చి సల్లంగా జారుకుపోతావు నీకోసం రాజనాల బత్తా వేరే తీయించి దాచాను. ఎప్పుడు పట్టుకువెళ్తావు?" బాపయ్య ముద్దుగా అన్నాడు.

చంద్రవంకలా నవ్వింది మాణిక్యం. అతని చేతుల్లో వరిగిపోతూనే కళ్ళుమూసుకుంది మాణిక్యం.

* * *

"వారే! మీ బాప్ప ఎప్పుడూ రాజనాలు బియ్యమే కాని ఇంకేమి తినదురా! పనని అప్పటికప్పుడు కాలితో నలిపి, ఆ దాన్నెం దంపి అన్నం వండుకుంటుందిరా! వాయిల్ కోకలేకాని ముతకకోకలు కట్టనేదు! వారాని కోపాలయినా బయసోకపు సూడాలంటుంది."

రాజయ్య తన ప్రేమకథ ముసిరిగాడితో తన్మయత్వంతో చెప్పుకుపోతున్నాడు. ముసరిగాడు చెవుల్లో అమృత ధారలు వర్షించినట్లు వింటున్నాడు. వెంకటేశు మొలనున్న సత్తుపావలాకాసుల్ని పీకుతుంటూ బరుకుతుంటున్నాడు. వెండివర్షంలా జలజల్లాడుతున్న వెన్నెల్లో సీమచింతచెట్టు మీద నున్న కొల్లేటికొంగల్ని. వెన్నముద్దల్లావున్న జల్లి సీమకొంగలు "క్వేక్ క్వేక్" మని పలకరిస్తున్నాయి. స్వచ్ఛ నిర్మల నీలాకాశంలోని చుక్కల్ని వేటాడేందుకు

చంద్రుడు పరుగెట్టుతోంటె, చంద్రుణ్ని వేటాడుతూ, మబ్బులు పరుగెట్టుతున్నాయి. తన స్వచ్ఛతని కళంక పరిచేలా, దృశ్యమానమవుతున్న ఈ వేటయొక్క మలినతని, మానవులు గుర్తిస్తారేమో అన్న బాధతో నిర్మల నిష్కళంక నీలాకాశం మిలమిల మెరిసే వెన్నెలతో సన్నని నీటి కదలికల చివర్లలోంచి నవ్వుతూన్న కాలవమీదికి వంగిపోయింది. బలవంతులు బలహీనుల్ని వేటాడటమే సృష్టికర్త నిర్ణయమౌతున్నది. అనుకుంటూ నిద్రగన్నేరు చెట్టుమీద గుడ్లగూబ గురగురమంది.